క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల మూడో విడత భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

శ్రావణ మాస పూజలు ప్రారంభం



విశేష అలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయంలో శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజామున శ్రీమహాలక్ష్మి, శ్రీమహా దుర్గ, శ్రీమహా సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఉక్కునగరం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక భవనం కోసం వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయుడు తదితరులు

పెదగంట్యాడ: కల్లు గీత కార్మికులకు సామాజిక భవనం నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేయాలని గాజువాక పారిశ్రామిక ప్రాంత కల్లు గీత సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నెల్లి సాధూరావు, పెద నూకరాజు, సప్పిడి నాగరాజు, పితాని భాస్కరరావు, గురుమూర్తి తదితరులు ఎల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న అప్పారావు

అగనంపూడి: విశాఖ ఉక్కులో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పి.పద్మారావు, కోసూరి సూరిబాబు దంపతులను స్టీల్ పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొలిపాక అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సేవా సంఘంలో వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గొంధోళి పైడికొండ, పుట్టా శ్రీనివాసరావు, సెసెట్టి అప్పారావు, మొండి సత్యనారాయణ, స్వర్ణపూడి ఈశ్వరరావు, గుదే గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ, టెట్‌పై అవగాహన సదస్సు రేపు

దాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ, టెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కో ఆర్డినేటర్ పి.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు నిష్ణాతులు పాల్గొని పరీక్షలపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి 160 పేజీల విద్యా మనో విజ్ఞాన శాస్త్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 93472 05549 నంబరుకు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- 8న ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు
- నియోజకవర్గంలోని 81 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు



నోటీసును అతికిస్తున్న హెచ్‌ఎం విజయ ప్రశాంతి



ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పెదగంట్యాడ విద్యాశాఖాధికారులు

గాజువాక/పెదగంట్యాడ: పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నిక ప్రక్రియ జోరుగా సాగుతోంది. పేరెంట్స్ కమిటీల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ఇప్పుడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పేరుతో ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక విద్యాశాఖాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ నెల 8న నిర్వహించనున్న ఎస్‌ఎంసీ ఎన్నికలకు మొత్తం ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో గల గాజువాక నియోజకవర్గంలో మొత్తం 81 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలను నిర్వహించనున్నారు. గాజువాక మండలంలో ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 39 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనుండగా, పెదగంట్యాడ మండలంలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 ప్రాథమికోన్నత పాఠశాల, 31 ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

షెడ్యూల్ ఇలా..

ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు ప్రతి పాఠశాలలోని నోటీస్ బోర్డులో ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచారు. 5న ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితా ప్రకటించారు. ఈ నెల 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సభ్యులు ఎన్నికల నిర్వహణ పూర్తి చేయడం, 2 గంటలకు కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం, అనంతరం 3గంటలకు నూతన ఎస్‌ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

మార్గదర్శకాలు

ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు కావాలి. కోరం ఏర్పడటానికి సమయ పరిమితిని హెడ్‌మాస్టర్ నిర్వహిస్తారు.

చేతులెత్తే విధానం

ఈ ఎన్నికలు సాధారణంగా చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహిస్తారు. అపరిష్కృత వివాదాలు అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబిస్తారు.

ఒకరికే ఓటు వేసే హక్కు

విద్యార్థి తల్లితండ్రులు ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. వివిధ తరగతుల్లో పిల్లలు ఉంటే ఆయా తల్లిదండ్రులు ఆయా తరగతి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అర్హులే. ఎస్‌ఎంసీలో ఎన్నికైన సభ్యుల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన సమూహం లేదా బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ అయి ఉండాలి. ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. ఈ ఎన్నికల ప్రక్రియలో అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.



గాజువాక హైస్కూల్‌లో అతికించిన ఎన్నికల నోటీసు

షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు

గాజువాక మండలంలోని పాఠశాల్లో ఎస్‌ఎంసీల ఎన్నికలకు విద్యాశాఖ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు సాగుతున్నాయి. మండలంలో మొత్తం 46 స్కూళ్లలో ఎన్నికలను నిర్వహిస్తాం. ఈ నెల ఒకటో తేదీన ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తూ వచ్చాం. ఎనిమిదో తేదీన ఎన్నికల అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఉంటాయి.

– విశ్వనాథం, గాజువాక మండల విద్యాశాఖాధికారి

పకడ్బందీగా నిర్వహణ



పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికలు నిర్వహించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశాం. ఈ నెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించిన అనంతరం, అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహిస్తాం.

–ఇ.శ్రీనివాసరావు, పెదగంట్యాడ ఎంఈవో–1

పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలి



పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు కోరారు. ఈ సమస్యపై ఈ నెల 6 నుంచి 8 వరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద అసోసియేషన్ ప్రతినిధి కణితి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాకు మద్దతుగా విశాఖ నగరంలోని జీవీఎంసీ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 8న ధర్నా చేయనున్నామని తెలిపారు. మినిమం పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, డీఏకు అనుగుణంగా మెడికల్ సౌకర్యాలు కల్పించాలని, పెన్షనర్లకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. రైలు చార్జీల్లో 50శాతం మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ పెంటారావు, శెట్టి అప్పారావు, బైరెడ్డి గురప్ప, దుర్గారావు, శెట్టి చిన్నా సన్యాసిరావు, నక్క అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

900 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ రైస్‌తో సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 900 కేజీల పీడీఎస్ రైస్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఆటోనగర్‌లో అప్పల నాయుడు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్‌ను సోమవారం ఏపీ 31టీడబ్ల్యూ 5484 నంబర్ గల ఆటోలో తరలిస్తుండగా గాజువాక పోలీసులు గుర్తించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సివిల్ సప్లై ఆర్‌ఐ రవికుమార్ వీఆర్వోలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను గాజువాక పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలని..

లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ



నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న లంకెలపాలెం విద్యార్థులు

అగనంపూడి: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో భారతదేశం క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బాక్సింగ్ కోచ్ షేక్ రెహ్మాన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రమణ, శ్రీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలి

అగనంపూడి: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనానికి స్థలం కేటాయించేలా చొరవ తీసుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావును అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఆయన్ను కలసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, బీహెచ్‌పీవీ తదితర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన అగనంపూడి ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్స్ పేరుతో మూడేళ్ల క్రితం ఒక సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 250 మంది సీనియర్ సిటిజన్స్ సభ్యులుగా ఉన్న అసోసియేషన్‌కు భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు జి.బోసుబాబు, బి.భాస్కరరాజు, కాళిదాస్, వై.సాంబశివరావు పాల్గొన్నారు.

గాజువాకలో మలబార్ గోల్డ్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: గాజువాక మెయిన్ రోడ్‌లోని సినిమా హాల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం మలబార్ గ్రూప్ చైర్మన్, ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ గాజువాక ప్రజల కోసం అద్భుతమైన ఆభరణాల సేకరణలను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. శ్రావణమాసంతో పాటు షోరూమ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని గోల్డ్, డైమండ్ కస్టమర్లకు ప్రతీ కొనుగోలుతో ఉచిత వెండి నాణేన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ ఈ నెల 18వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఉపాధి కల్పించేవారిని ఆహ్వానించి, వారికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కస్టమర్ జాన్సన్, జోనల్ హెడ్ కె.షరీజ్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ఎ.జె.స్టాలిన్, మాజీ కార్పొరేటర్ రఫీ, రిటైల్ ఆపరేషన్స్ హెడ్ పి.కె.సిరాజ్, జోనల్ హెడ్ కె.షనిబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన అప్పారావు

పరవాడ: అనకాపల్లి–గాజువాక రహదారిలో లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో సోమ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలు.. అనకాపల్లి మండలం మారేడుపూడికి చెందిన అప్పారావు (48) ద్విచక్ర వాహనంపై శ్రీరామనగర్ కాలనీకి వెళుతున్నారు. ఈ క్రమంలో లంకెలపాలెం ప్రభుత్వ వైన్‌షాపు దాటిన తర్వాత ఎడమ వైపు తిరుగుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన ఫార్మాసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు డ్రైవర్ అప్పారావు నడుపుతున్న బైక్ హ్యాండిల్‌ను రాసుకుని వెళ్లిపోయాడు. అప్పారావు రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలు తగిలాయి. ఇంతలో అదే మార్గంలో వస్తున్న మరో ద్విచక్ర వాహనం రోడ్డు మీద పడి ఉన్న అప్పారావుపై నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై మృతుడి కుమారుడు కనకరాజు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత

పెందుర్తి: విద్యార్థి దశలో ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత అన్నారు. స్థానిక ఎస్సీ బీసీ వసతి గృహంలోని విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికాలంలో యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితిలోనూ చెడు మార్గాల వైపు వెళ్లవద్దని..వెళితే జైలుపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

7న సీజ్ చేసిన ఆటోల వేలం

సబ్బవరం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో పాత ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ రెండు ఆటోలను ఈ నెల 7న వేలం వేయనున్నట్లు స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సబ్బవరం సెబ్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

తల్లిపాలే బిడ్డకు సంజీవని

- అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది
- వాడవాడలా తల్లిపాల వారోత్సవాలు



వెంకన్నపాలెంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డాక్టర్ హేమలత



వియ్యపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

పెదగంట్యాడ: తల్లి పాలే బిడ్డకు సంజీవని అని పెదగంట్యాడ క్లస్టర్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వియ్యపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం, గొంతినవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు వి.కనకరత్నం, కనకమహాలక్ష్మి, కె.సత్య, టి.విజయకుమారి, పి.ఉమామహేశ్వరి, ఆరోగ్య సిబ్బంది ఫాతిమా, ఉమా, శాంతి పాల్గొన్నారు.

- వెంకన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.భవాని, వరలక్ష్మి, లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీతాల కోసం రోడ్డెక్కిన యువ కార్మికులు

- అడ్మిన్ విభాగ కూడలి వద్ద 'తాలీ బజావో' నిరసన



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ కూడలి వద్ద తాలీ బజావో నిర్వహిస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలంటూ స్టీల్‌ప్లాంట్ యువకార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్లకార్డులతో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్నారు. అందులో భాగంగా కార్మికులు సోమవారం తాలీ బజావో (ప్లేట్ల చప్పుడు) తో తమ ఆవేదన తెలియజేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్లేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ తమ ఘోష వినాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రతీ నెలా జీతాల చెల్లింపు విషయంలో యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో ధర్మాల కనకరెడ్డి, ప్రతిమ, అట్టా అప్పారావు, జెర్రిపోతుల రమణ, వియ్యపు కిరణ్, దుల్ల గోపీ తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బి.డేవిడ్ వారికి మద్దతు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు..



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ నాయకులు

గాజువాక: క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గాజువాక, పారిశ్రామిక ప్రాంతంలోని క్రైస్తవ నాయకులు, సేవకులు ఐక్యంగా ముందుకు సాగాలని ఎపికా జిల్లా అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు కోరారు. గాజువాకలో సోమవారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడ ప్రాంతంలో క్రైస్తవుల కోసం ప్రత్యేకంగా సమాధుల స్థలం లేక ఏళ్ల తరబడి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. శ్మశాన స్థలం సాధనకు ఐక్యంగా కృషి చేద్దామని కోరారు. ఇటీవల కాలంలో చర్చిలు, పాస్టర్లపై జరుగుతున్న దాడులతో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఐక్యవేదికను ఏర్పాటు చేసి ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో బిషప్ ఎల్.శామ్యూల్, ఎల్.ఆర్.బిల్లీగ్రహం, పీటర్, ధనరాజ్, డేవిడ్‌రాజు, కేత అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఏకపక్ష వైఖరి విడనాడాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మికసంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రప్రభుత్వం ఏకపక్ష వైఖరి అవలంబిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కుట్రలు చేస్తున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1271వ రోజు, సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం విలువైన భూమిని ధారాదత్తం చేసిన వారిని నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, జి.జయ, ఎ.శివరామకృష్ణ, సీతారామరాజు, చీకటి శ్రీనివాస్, డి.దేముడు జి.ఆనంద్‌కాండ్రేగుల శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- నేరాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- డీసీపీ–2 తుహిన్ సిన్హా సూచన
- పినగాడి, సరిపల్లి చెక్ పోస్టుల తనిఖీ



సరిపల్లి వద్ద గంజాయి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ-2 తుహిన్ సిన్హా



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ-2 తుహిన్ సిన్హా

పెందుర్తి: గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నామని డీసీపీ–2 తుహిన్ సిన్హా అన్నారు. సోమవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి..పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్‌గా ఉండాలన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా గస్తీ నిర్వహించాలని క్రైం విభాగం అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎవరు అలక్ష్యం వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పినగాడి, సరిపల్లి వద్ద ఉన్న గంజాయి చెక్‌పోస్టులను తుహిన్ సిన్హా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ పనితీరును పర్యవేక్షించారు. సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ అసిరి తాత పాల్గొన్నారు.